క్లుప్తంగా

రైతులకు కెపాసిటర్ల పంపిణీ



లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన పలువురు రైతులకు బుధవారం ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈ గణేష్, ఏఈ అశోక్ కెపాసిటర్లు పంపిణీ చేశారు. ఓవర్‌లోడ్ కారణంగా బోరు మోటార్లు తరుచూ కాలిపోతుండడంతో వాటి నివారణకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని డీఈ రైతులకు సూచించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

మాచారెడ్డి: హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను కాపాడాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు, ఉపాధి పనులు, బృహత్ పల్లె ప్రకృతి వనాలపై ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పనులు, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో ప్రమోద్, ఏపీవో సాయిబాబా, ఎంపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు ఇస్తాం



బిచ్కుంద: రుణాలను సకాలంలో చెల్లించాలని సహకార సంఘం చైర్మన్ బాలు శ్రీహరి రైతులకు సూచించారు. రైతులకు రూ. 1.70 కోట్లు రుణమాఫీ వర్తించడంతో 192 మంది రైతులకు సంబంధించిన రుణాలను రెన్యూవల్ చేశారు. అర్హులైన రైతులకు కొత్తగా రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదవరావు, ఏవో పోచయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



నిజాంసాగర్(జుక్కల్): గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బాన్సువాడ ఐసీడీఎస్ సీడీపీవో కళావతి సూచించారు. బుధవారం మండలంలోని బ్రహ్మణపల్లి, వెల్గనూర్, మంగ్లూర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి ఆయా కేంద్రాల్లోని చిన్నారుల బరువు, ఎత్తు కొలతలను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ఆమె వెంట సర్పంచులు రమేష్‌గౌడ్, గైని స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, వినోద, పద్మ తదితరులు ఉన్నారు.

క్రీడాప్రాంగణాలు పూర్తి చేయాలి

నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూర్ పంచాయితీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీవో శ్రీనివాస్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో క్రీడాప్రాంగణం పనులను త్వరగా పూర్తిచేయాలని సర్పంచ్ బాల్‌రెడ్డికి ఆయన సూచించారు.

కబ్జాకు గురైన స్థలం పరిశీలన

లింగంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండటంతో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకరచారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీపీ రఘు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత



భిక్కనూరు: మౌలిక వసతుల కల్పనకు కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ గాలిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బస్వాపూర్‌లో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ మంజుల మల్లారెడ్డి, ఎంపీటీసీ లీలావతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రిగోపాల్, నాయకులు కర్నాల మల్లేషం, గౌరిగారి రాజిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాలతో ఉపయోగం

- విద్యార్థుల నైపుణ్యత కోసమే తొలి మెట్టు కార్యక్రమం
- మండలస్థాయి బోధనోపకరణాల్లో కొన్ని జిల్లాస్థాయికి ఎంపిక

సాక్షి, నెట్‌వర్క్: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ (టీఎల్‌ఎం) మేళా నిర్వహించడం వల్ల విద్యావ్యవస్థలో ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు ఎంతో దోహద పడతాయని పలువురు పేర్కొన్నారు. బుధవారం పలు పాఠశాలల్లో టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు. బాన్సువాడ సింధూ విద్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి మేళాకు హాజరైన బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు టీఎల్‌ఎం మేళాలు ఎంతో ప్రయోజనం అన్నారు. ఉపాధ్యాయులు బోధనోపకరణలు తయారు చేయడం అభినందనీయం అన్నారు. బీబీపేటలో నిర్వహించిన మేళాను జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. బిచ్కుంద మేళాలో 250 ఉపకరణాలను ప్రదర్శించగా ఇందులో 20 జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి.



భిక్కనూరులో టీఎల్‌ఎం మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు



పెద్దకొడప్‌గల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



పిట్లంలో..



బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



తాడ్వాయిలో పరిశీలిస్తున్న అధికారులు



నిజాంసాగర్‌లో ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



నాగిరెడ్డిపేటలో..



రామారెడ్డిలో ఉపాధ్యాయులకు సన్మానం



బిచ్కుందలో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ



బాన్సువాడలో మేళాను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్

బ్రెయిలీకి నివాళి



గాంధారి: మండలంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ గోవర్ధన్, ఎంఈవో సేవులా తదితరులు బ్రెయిలీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధారి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డిలో కేక్ కట్ చేశారు. అంధుల కోసం ఆయన బ్రెయిలీ లిపిని అందుబాటులోకి తెచ్చాడని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్, నాయకులు పంగ ఈశ్వర్, నితిష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బాలరాజుగౌడ్, రాజమౌళి, నర్సింలు, శంకర్, స్వామి, మల్లయ్య, సిద్దిరాములు పాల్గొన్నారు.

భవిత కార్యాలయం తనిఖీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని భవిత కార్యాలయాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీపతి బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రతివారం ఫిజియోథెరపీ క్యాంపును ఏర్పాటు చేయాలని సిబ్బంది వెంకటేశం, శివకుమార్‌కు ఆయన సూచించారు.

తెలుగు ఉపాధ్యాయుడికి కళారత్న అవార్డు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జంగం శ్రీశైలంకు కళారత్న అవార్డు దక్కింది. మహాజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ తదితరుల చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా కౌన్సిలర్లు పోలీస్ క్రిష్ణాజీరావు, కాసర్ల గోదావరిస్వామి, ఉరుదొండ వనిత, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

నిధుల వినియోగంపై సర్పంచ్‌లకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

ఎల్లారెడ్డి: పంచాయతీలకు మంజూరైె 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సర్పంచులకు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. అదేవిధంగా క్రీడా ప్రాంగణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీవో ప్రకాష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో భయం వీడాలి



బాన్సువాడ టౌన్: పరీక్షల సమయంలో ముందు భయం వీడితే మంచి ఫలితాలు సాధించవచ్చని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. బుధవారం పట్టణంలోని రెడ్డి సంఘంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ అంబాజీ, అధికారులు లియో, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయాలి



కామారెడ్డి అర్బన్: ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయాలని తెలంగాణ ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన బి.సాయిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్‌లకు నాయకులు కోరారు. బుధవారం వారిని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకట్‌రెడ్డి, బి.సాయిలు సన్మానించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజారామ్, దయానంద్, కాసం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కామారెడ్డి టౌన్: రాష్ట్ర గజిటెడ్ ప్రదానోపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం లింగం ,రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాకిషన్ ,కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ గౌడ్ , నాయకులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్..

పెద్దకొడప్‌గల్: పీఆర్టీయూ క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, తహసీల్దార్ దశరత్, ఎంఈవో దేవీసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి కిషోర్, ప్రదానోపాధ్యాయులు రామాంజనేయులు, గంగ కిషన్, విఠల్ సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చెర్మన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్..



పిట్లంలో టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణలో..

పిట్లం: టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను మండలం కేంద్రంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ విజయరెడ్డి, ఎంఈవో దేవిసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి గణపతి, సభ్యులు కృష్ణమూర్తి, అశోక్, బటరాం, రూప్‌సింగ్, రమేష్, రాజశేఖర్, నాగభూషణం పాల్గొన్నారు.

అయాచితం నటేశ్వరశర్మకు సన్మానం



కామారెడి అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన అష్టావధాని, కవి, రచయిత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మను హైదరాబాద్ రవీంద్రభారతిలో దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా సన్మానించారు. అవధాని, ఉపన్యాసకుడు గరికిపాటి నరసింహారావు, దర్శనమ్ సంపాదకులు మరుమాముల వేంకటరమణ శర్మ సన్మానించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి అప్పర్ ప్రమరీ పాఠశాలలో బుధవారం నిర్మల మోహన్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్ శాస్త్రీ, రవికాంత్, శశికాంత్, కల్పన ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సుమితా జనార్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సింహాద్రి, ఉపాధ్యాయులు టి లక్ష్మీబాయి, డి వాణి, భాగ్యలత, రమాదేవి, కోటేశ్వరి, పి మహేష్ పాల్గొన్నారు.



నోటుపుస్తకాలతో విద్యార్థులు

కంటి అద్దాలు..

ఎల్లారెడ్డి: పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో వృద్ధులకు మదన్‌మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అద్దాలు అవసరమని గుర్తించిన వారికి బుధవారం పంపిణీ చేశారు.

ఫోన్ ట్యాపింగ్ చేయడం దారుణం

భిక్కనూరు: బీఎస్పీ అధినేత ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ట్యాపింగ్ చేస్తోందని ఆరోపిస్తూ భిక్కనూరులో ఆ పార్టీ నేతలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, కోశాధికారి హరిలాల్, కామారెడ్డి ఆసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కర్రోల్ల బాల్‌రాజు, గంగల్ల రవీందర్, నరేషు, వేణు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నేతలు

కప్పేసిన మంచు

బీబీపేట: వారం రోజుల నుంచి పొగమంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో పనుల కోసం ఉదయం వెళ్లే రైతులు, కూలీలు చలితో వణికిపోతున్నారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు బయటకు రావాలంటేనే మండలంలోని కొన్ని గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఉదయం బీబీపేట, మల్కాపూర్ రోడ్డులో కన్పించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మన్పించింది.



బీబీపేట రహదారిలో కమ్ముకున్న మంచు

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

సదాశివనగర్: మార్కెట్ కమిటీ భవన నిర్మాణ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో సదాశివనగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వడ్ల రాజేందర్, కార్యదర్శి యస్.గంగు, సూపర్‌వైజర్ లక్ష్మినర్సయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి

సంక్షిప్తం

మహాజన సోషలిస్టు పార్టీ జెండా ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: మహాజన సోషలిస్టు పార్టీ ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాగయ్య, ఇతర నాయకులు జెండాను ఆవిష్కరించారు.

అధిక ఫీజులు వసూలపై ఆందోళన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

ఎక్సైజ్ సిబ్బంది తనిఖీ

బీబీపేట: మండల కేంద్రంతో పాటు మల్కాపూర్, తుజాల్‌పూర్ గ్రామాల్లో దోమకొండ ఎక్సైజ్ సీఐ పోతరెడ్డి అధ్వర్యంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. మద్యం డంపు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాస్, స్వాతి, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని మాసాన్‌పల్లిలో విద్యుదాఘాతంతో సమతకు చెందిన పాడిగేదె మృతి చెందింది.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ జిల్లా కోటగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన బీజేపీ కార్యకర్తలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి డిమాండ్ చేశారు.

ఎల్‌వోసీ అందజేత

దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 2.50 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావ్ అందజేశారు.

నేడు స్పీకర్ పర్యటన

బాన్సువాడ టౌన్/బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్, కొత్తాబాది గ్రామాల్లో గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పర్యటించనున్నట్లు బుడిమి సొసైటీ చైర్మన్ పిట్ల శ్రీధర్ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

బాన్సువాడ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారి చేయిస్తున్నట్లు కమిషనర్ రమేష్ తెలిపారు. 13వ వార్డులో కౌన్సిలర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జుబేర్‌తో కలిసి పర్యటించారు.

అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడి నియామకం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయ కమిటి అధ్యక్షుడిగా పద్మ శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై ట్రాక్టర్ నడిపితే చర్యలు

భిక్కనూరు: కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై ట్రాక్టర్ నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గాంధీగౌడ్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రామారెడ్డి: మండలంలోని సింగరాయపల్లికి చెందిన బాల్‌నర్సవ్వ మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు.